దయనీయంగా సాగునీటి కాలువలు!

- వణికిస్తున్న ఏనుగుల కోడు
- ఆందోళన చెందుతున్న రైతులు
- ప్రభుత్వ స్పందన నిల్

పెనమలూరు: మండల పరిధిలో సాగునీటి కాలువలు, డ్రెయినేజీల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. సార్వ సీజన్ కొద్ది రోజుల్లో మొదలవుతున్నా సాగు కాలువల మరమ్మతులు, డ్రైనేజీల పూడిక తీత పనులు ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టలేదు. దీంతో రైతులు ప్రభుత్వ తీరు పై ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో బందరు కాలువ, కృష్ణా ఈస్టు బ్యాంక్ కెనాల్ (కేఈబీ) కాలువలు ఉన్నాయి. ఈ కాలువల ద్వారా తూర్పు కృష్ణా, దివిసీమలోని దాదాపు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు సరఫరా ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువల ద్వారా జరుగుతుంది. అయితే ప్రస్తుతం ఈ సాగు కాలువల పరిస్థితి దయనీయంగా ఉంది. యనమలకుదురు లాకుల వద్ద నుంచి బందరు కాలువ, కేఈబీ కాలువ రెండుగా చీలుతాయి. అయితే లాకుల వద్ద వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయి.

దారుణంగా ఉన్న సాగు కాలువలు..

బందరు కాలువ, కేఈబీ కాలువ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. బందరు కాలువ అయితే పూర్తిగా గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో పూడుకు పోయి ఉంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో ఈ రెండు కాలువలు క్రమం తప్పకుండా పూడికలు తీయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సాగు కాలువలను గాలికి వదిలేశారు. కేఈబీ కాలువలో కూడా వ్యర్థాలతో నిండి పోయి ఉంది. ఈ రెండు కాలువలలో పూడికి తీత పనులు చేసి ఉండి ఉంటే సాగు నీరు దిగువ ప్రాంతాలకు అందుతుంది. అయితే ప్రసుత్తం ఆ పరిస్థితి కనబడటం లేదు.



గుర్రపు డెక్కతో పూడుకుపోయిన బందరు కాలువ

కనీసం యనమలకుదురు లాకుల వద్ద వ్యర్థాలు కూడా తొలగించలేదు.

పూడికతీతకు నోచుకోని కెనాల్స్...

మండల పరిధిలో రైతులను తరచుగా కష్టాలకు గురి చేసే ఏనుగుల కోడు డ్రైనేజీని పూడిక తీయకుండా వదిలేశారు. తాడిగడప నుంచి ప్రారంభమయ్యే ఏనుగుల కోడు డ్రైనేజీ పలు గ్రామాల మీదగా వెళుతుంది. అధిక వర్షాలు పడితే ఏనుగుల కోడు డ్రైనేజీ నుంచి పంట పొలాల్లోని వృథా నీరు బయటకు వెళ్లాల్సి ఉంది. అయితే ఈ డ్రైనేజీ పూడిక తీత పనులు జరగని సమయాల్లో అధిక వర్షాలు పడితే వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునుగుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏనుగుల కోడు డ్రైనేజీ ఆవశ్యకత అధికారులు గుర్తించక నిర్లక్ష్యంగా ఉండటంతో నేడు డ్రైనేజీ పూర్తిగా పిచ్చి మొక్కలతో పూడిపోయి ఉంది. చుక్క నీరు కూడా పారుదల జరిగే పరిస్థితి కనబడటం లేదు. ఈ లెక్కన అధిక వర్షాలు పడితే తమ పంటల పూర్తిగా మునిగి పోతాయని, తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో పంట కాలువలూ అదే స్థితి..

మండల పరిధిలో వివిధ గ్రామాల్లో ఉన్న సాగు కాలువలు కూడా పూడిక తీత తీయకుండా వదిలేశారు. సార్వా వరి సాగు మండలంలో దాదాపు 8 వేల ఎకరాల్లో జరుగుతుంది. ప్రధానంగా తాడిగడప నుంచి పెదపులిపాక, పెనమలూరుకు వెళ్లే పంట కాలువ పూడిక తీత తీయలేదు. గోసాల, వణుకూరు, పెనమలూరులలో కూడా పంట కాలువలు దీనస్థితిలో ఉన్నాయి. పోరంకి శివారులో ఉన్న డ్రైనేజీ పూడిక తీత తీయక పోవటంతో నీటి పారుదల జరగటం లేదు. కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేక పోవటంతోనే సాగు కాలువులు, డ్రైనేజీలను మరమ్మతులు చేయకుండా వదిలేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పిచ్చి మొక్కలతో ఏనుగుల కోడు డ్రెయిన్



వ్యర్థాలు, పిచ్చి మొక్కలతో యనమలకుదురు లాకులు

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

గన్నవరం:అన్నదాతల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి డాక్టర్ డి. సుధారాణి సూచించారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. తద్వారా కూలీల కొరతను అధిగమించడంతో పాటు సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.
ప్రతి రైతు తప్పనిసారిగా భూసార పరీక్షలు చేయించాలని సూచించారు. భూసారాన్ని కాపాడుకునేందుకు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సాగు పద్ధతులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసింహారావు, శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్, డీఆర్‌సీ నుంచి డీడీఏ జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాస్, ఏవోలు పద్మజా, రజనీ, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జె. శైలజరాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గన్నవరంలో సమైక్యతా ర్యాలీ



గన్నవరం:దేశంలో మత సామరస్యం వర్ధిల్లాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గన్నవరం పట్టణంలో గురువారం సమైక్యత ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌కు ప్రదర్శనగా తరలివెళ్లి ఉగ్రవాదం, యుద్ధోన్మాదం నశించాలని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం పెరగడానికి పాలకుల తీరే కారణమన్నారు. దేశ ప్రజలందరూ శాంతి సామరస్యాలతో జీవనం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో మత సామరస్యం కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. పార్టీ నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, మీరాఖాన్, అజ్మీర వెంకటేశ్వరరావు, బెజవాడ తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రారంభమైన పారాయణం

గన్నవరం:స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికలో గురువారం నుంచి చాలీసా పారాయణం ఘనంగా ప్రారంభమైంది. భక్తులచే శ్రీలలిత సహస్రనామ మణిదీపవర్ణన సాయి చాలీసా, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ తొమ్మిది గురువారాలు పాటు చాలీసా పారాయణం కొనసాగుతుందని చెప్పారు. పరిసర ప్రాంత భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యోగాలో అందరూ భాగస్వాములు కావాలి



గన్నవరం:ఉంగుటూరు మండలంలోని ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ విజయ్ నేతృత్వంలో ముక్కపాడు, ఇందుపల్లి, నందమూరు గ్రామ సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. యోగాంధ్ర జూన్ 21వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీడీఓ సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వి.సూర్యప్రకాష్, పలువురు ట్రైనర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దళితులను కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలి

కంకిపాడు: తెనాలి ఐతా నగర్‌లో నడిరోడ్డుపై యువకులను కొట్టిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ దళితులపై దాడులు పెరుగుతుంటే హోం మంత్రి కనీసం స్పందించకపోవటం దారుణమన్నారు. యువకులపై దాడికి పాల్పడిన పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోర్టులు, చట్టాలను ఉల్లంఘిస్తూ పోలీసులు అడ్డగోలుగా వ్యవహరించటం బాధాకరమన్నారు. ఘటనపై ఎస్సీ కమిషన్, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ఉచిత సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో డాక్టర్ వి.నవ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత సంతాన సాఫల్య కేంద్రాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ధనేకుల మురళీ మోహన్ రావు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాస రావు పాల్గొన్నారు. డాక్టర్ అయోధ్య సత్యానారాయణ మాట్లాడారు.

దివీస్ ఉద్యోగి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెంలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న దివీస్ ఉద్యోగి మజ్జి రామకృష్ణ (30) గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మరొక వ్యక్తి గ్యాస్ సిలిండర్ కోసం రామకృష్ణ ఇంటి తలుపు తట్టగా.. లోపల ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆయన భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన రామకృష్ణ భీమిలి మండలం దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్ విభాగంలో ఉద్యోగి. అతనికి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టానికి చెందిన నవ్య అనే మహిళతో వివాహం అయింది. వీరికి 4, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామకృష్ణ ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పిల్లలతో కలిసి అతని భార్య పుట్టింటికి వెళ్లినట్లు తెలిసింది. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

కంకిపాడు: చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డ నిందితుడిని కంకిపాడు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్ ప్రాంగణంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ జె.మురళీకృష్ణ నేతృత్వంలో పోలీసులు నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరిచారు. కేసు వివరాలను సీఐ మురళీకృష్ణ వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన కంకిపాడు పట్టణానికి చెందిన కొట్టే సాయి లీల మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి ఆమె ముందు వాహనాన్ని ఆపి మెడలో ఉన్న బంగారు నానుతాడు తెంచుకుపోయాడు. ఈ ఘటనలో 5 గ్రాములు నానుతోడు చోరీ అయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ డి.సందీప్ నేతృత్వంలో ప్రత్యేక బృందం గాలింపు చేపట్టింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ అంశాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు సాగించారు. పట్టణంలోని శివాలయం సమీపంలో ఓ యువకుడు పోలీసులను గమనించి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడుగా తేలింది. అతని వద్ద 5 గ్రాముల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెనమలూరు మండలం పోరంకి ప్రభునగర్‌కు చెందిన నిమ్మకూరి రమేష్‌గా గుర్తించారు. చెడు అలవాట్లకు బానిసై చోరీలకు పాల్పడేందుకు తెగబడినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసును ఛేదించటంలో ఎస్‌ఐ డి.సందీప్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పీసీలు పీఎస్‌ఎస్ మూర్తి, సయ్యద్‌బాజీబాబులు ప్రతిభ చూపటంతో వారిని అభినందించారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ జె.మురళీకృష్ణ, ఎస్‌ఐ డి.సందీప్ తదితరులు

భర్తపై హత్యాయత్నం సూత్రధారి భార్యే

పెనమలూరు: భర్త పై జరిగిన హత్యాయత్నం కేసులో భార్యే ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించి ఆమెపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు గ్రామంలో గత ఆదివారం బగ్గ శ్రీనివాసరావుపై అయన ఇంట్లోనే పల్లి జానకిరామ్ అనే వ్యక్తి ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అసలు సూత్రధారి భార్య లత అని తేల్చి ఆమె పై కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం భద్రి గ్రామానికి చెందిన బగ్గ శ్రీనివాసరావు అదే జిల్లా ఎర్రవలసకు చెందిన లతతో గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. శ్రీనివాసరావు విజయవాడలో ఓ బంగారు నగల షాపులో మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. శ్రీనివాసరావు కుటుంంతో కలిసి యనమలకుదురు తాడిగడప డొంకరోడ్డులో ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్నాడు. కాగా భార్య లతకు ఆమె స్వగ్రామానికి చెందిన జానకిరామ్‌తో సన్నిహిత సంబంధం ఉంది. దీంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి.

కుట్రపూరితంగా వ్యవహరించి.....

కాగా భర్త శ్రీనివాసరావు అడ్డుగా ఉన్నాడని భర్తను అంత మొందించటానికి భార్య లత, జానకిరామ్ కుట్ర పన్నారు. భార్య లత పిల్లలతో పాటు ఇటీవల పుట్టింటికి వెళ్లింది. వారం క్రితం భర్త భార్య వద్దకు వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం యనమలకుదురు ఇంటికి వచ్చాడు. అయితే ఈ సమాచారం తెలుసుకున్న జానకిరామ్ మారుతాళంతో ఇంటి తాళం తెరిచి బెడ్ రూమ్‌లో నక్కి ఉన్నాడు. శ్రీనివాసరావు ఇంటి తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్లగానే జానకిరామ్ ఒక్కసారిగా రాడ్‌తో దాడి చేశాడు. శ్రీనివాసరావును చంపటానికి యత్నించగా శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన విచారణ చేయగా అసలు ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. జానకిరామ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేసి విచారించగా భార్య లత ఈ ఘటనకు సూత్రధారని తేలటంతో పోలీసులు అవాక్కయ్యారు. అప్పటికే లత తన పుట్టింట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నాటకానికి తెరలేపింది. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగు చూడటంతో భార్య పై కూడా హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

మిస్టరీగా మారిన బాలిక అదృశ్యం కేసు

పెనమలూరు:పోరంకిలో అదృశ్యమైన బాలిక కేసు మిస్టరీగా మారింది. ఈ కేసు అనేక మలుపులు తిరిగి ఒకరి మరణానికి సైతం కారణమయింది. పోలీసులు తమను వేధించటంతోనే తన భర్త మృతి చెందాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు చెబుతుంటే, తాము విచారణ మాత్రమే చేశామని బాలిక ఆచూకీ ఇప్పటికి తెలియలేదని పోలీసులు అంటున్నారు. పోరంకి శివాలయం వద్ద ఉంటున్న బాలిక గత నెల 28వ తేదీ రాత్రి అదృశ్యమైంది. చందు అనే యువకుడు బాలికను తీసుకెళ్లాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన దంపతులు ఎండ మోహన్‌రావు, రేణుకకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మోహన్‌రావు గతంలో పోరంకిలో వాచ్‌మెన్‌గా పని చేశాడు. కొద్ది నెలల క్రితం వారి కుటుంబ శ్రీకాకుళం టౌన్‌కు వెళ్లింది. కాగా గత నెల 29వ తేదీన మోహన్‌రావు కుమారుడు చందు పోరంకి శివాలయం వద్ద బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు ఫోన్‌కాల్ డేటాను పరిశీలించారు. చందు తల్లి రేణుకతో టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో చందు తండ్రి మోహన్‌రావు, తల్లి రేణుకని పెనమలూరు పీఎస్‌కు తీసుకొచ్చి విచారించారు. అయితే చందు, బాలిక ఆచూకీ తెలియలేదు. బాలికకు చెందిన నగలు తల్లితో అమ్మినట్లు పోలీసులకు విచారణలో తెలిసింది. పైగా రాజాంలో లాడ్జిలో చందు, బాలిక కొద్ది రోజులు ఉన్నట్లు సీసీ పుటేజీలో గుర్తించారు. దీనికి తల్లి ప్రోత్సాహం ఉన్నట్లు పోలీసులు అనుమానించారు. దీంతో పోలీసులు విచారణ వేగవంతం చేయటంతో చందు కుటుంబ సభ్యుల పై ఒత్తిడి పెరిగింది.



శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందు తల్లి రేణుక, సోదరి అంజలి

తండ్రి ఆత్మహత్య....

కాగా పోలీసుల విచారణతో చందు తల్లితండ్రులు, సోదరి గత నాలుగు రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా గార మండలం వత్సవలస గ్రామంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందు తండ్రి మోహన్‌రావు మృతి చెందగా, తల్లి రేణుక, సోదరి అంజలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల వేధింపుల కారణంగానే తాము ఆత్మహతాయయత్నానికి పాల్పడినట్టు తల్లి మీడియాకు వెల్లడించింది. పోలీసుల పై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని కోరింది. కేసులో ప్రధాన నిందితుడు చందు ,మైనర్ బాలిక ఆచూకీ ఇప్పటికి పోలీసులు తెలుసుకోలేక పోయారు. తండ్రి మోహన్‌రావు మృతి చెందినా చందు తండ్రి అంత్యక్రియలకు సైతం రాలేదు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం

పెనమలూరు: గ్రంథాలయాలకు వెళ్లి విద్యార్థులు పుస్తక పఠనం చేయటం అలవాటు చేసుకోవాలని వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. భారతి మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే విజ్ఞానం వస్తుందన్నారు. విద్యార్థులతో తోక కథలు చెప్పించారు. శిక్షణ ఫౌండేషన్ సభ్యుడు రాజారావు విద్యార్థులకు విలువల గురించి వివరించారు. విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించారు.

ఆటల పోటీలతో మనో వికాసం

గన్నవరం రూరల్:ఆటల పోటీలు, యోగా విద్యార్థుల్లో మనో వికాసాన్ని పెంచుతాయని ముస్తాబాద శాఖ గ్రంథాలయాధికారి కె.జ్యోతికుమారి అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, పేపర్ రీడింగ్, చెస్, యోగాలో శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో విద్యార్థులను సమ్మర్ క్యాంపునకు క్రమం తప్పకుండా పంపుతున్నారని తెలిపారు. వారికి అభినందనలు అని పేర్కొన్నారు. ఈ కృషితో విద్యార్థులు ఎంతో ప్రగతి సాధిస్తారని ఆకాంక్షించారు.



వణుకూరు గ్రంథాలయంలో పుస్తక పఠనంలో విద్యార్థులు

ఉత్సాహంగా సాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ శిబిరంలో గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించడంతో పాటు జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు పర్యవేక్షణలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో పఠనాభిలాష పెంచేందుకు, సృజనాత్మక శక్తిని ప్రోత్సహించేందుకు విజ్ఞాన శిబిరం దోహదపడుతుందని చెప్పారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసక్తిగల రంగాల్లో ప్రతిభ చాటాలి

కంకిపాడు: విద్యార్థులు ఆసక్తి గల రంగాల్లో ప్రతిభ చాటాలని వక్తలు సూచించారు. వేసవి శిబిరాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. ఆసక్తి గల రంగాలను ఎంచుకుని ప్రావీణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఎం.మల్లేశ్వరరావు, గడ్డం దీపికా పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.



ముస్తాబాదలో చెస్ పోటీల్లో విద్యార్థులు



గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



కంకిపాడులో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

70 మంది టీచర్లకు స్థాన చలనం

విజయవాడ రూరల్:మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న 70 మంది టీచర్లకు స్థానచలనం జరిగే అవకాశం ఉంది. 8 సంవత్సరాలు ఒకే చోట పని చేస్తున్న ఎలిమెంటరీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీలుంటాయని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొంది. ఆ ప్రకారం విజయవాడ రూరల్ మండలంలో పని చేస్తున్న ఎలిమెంటరీ స్కూల్స్ ఉపాధ్యాయులు 70 మంది బదిలీ అవుతున్నారని మండల విద్యాశాఖాధికారి ఎ.సూరిబాబు తెలిపారు. 8 సంవత్సరాల నుంచి ఒకే చోట పని చేస్తున్న సెకండ్ గ్రేడ్ టీచర్లు 38 మంది, స్కూల్ అసిస్టెంట్లు 31 మంది, ప్రధానోపాధ్యాయులు ఒకరు చొప్పున బదిలీ అవుతారన్నారు. బదిలీల ప్రక్రియకు సంబంధించిన జీఓను ప్రభుత్వం విడుదల చేయడంతో గురువారం నున్న గ్రామంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్దకు ఉపాధ్యాయులు ఆప్షన్లు కోరుతూ దరఖాస్తు చేసుకొనేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో ఆ కార్యాలయం వద్ద సందడి నెలకొంది.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

పెనమలూరు:శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పోరంకిలో గత కొద్ది రోజులుగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని జిల్లా ఆధ్యాత్మిక సమన్వయ కర్త కేవీ మోహన్‌రావు, పోరంకి కన్వీనర్ కేవీ రంగారావు తెలిపారు. తాడిగడప జంక్షన్‌లో గురువారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సమితి వేసవిలో అందించిన సేవల వివరాలు సభ్యులు తెలిపారు. గత 43 రోజుల క్రితం మజ్జిగ, చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 36 వేల మంది ప్రయాణికులకు వేసవిలో మజ్జిగ పంపిణీ చేశామని వెల్లడించారు. దీనికి గాను రూ 1.34 లక్షలు నిధులు భక్తులు ఖర్చు చేశారని తెలిపారు. జూన్ 4వ తేదీ వరకు మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు తిరుమలరావు, బాలత్రిపురసుందరి, వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో...

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గురువారం దాతల సహకారంతో బాటసారులు, భక్తులు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉచిత మజ్జిగ పంపిణీకి విశేష స్పందన వచ్చినట్లు తెలిపారు . దాతలు, భక్తుల సహకారంతో ఈ వేసవి పూర్తయ్యే వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి

పెనమలూరు:యనమలకుదురులో విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడుకు చెందిన పి.సూర్యచంద్ర(40) భవననిర్మాణ కార్మికుడిగా పని చేస్తాడు. ఈ నెల 23వ తేదీన యనమలకుదురులో కొండ వెనక ప్రాంతంలో టవర్ లైన్ కింద నిర్మాణం చేస్తున్న గ్రూప్‌హౌస్ ఐదో అంతస్తులో హ్యాండ్‌కటింగ్ మెషన్‌తో పని చేసి ఆ తర్వాత దానిని కిందకు వేస్తుండగా అది విద్యుత్ తీగల పై పడి సూర్యచంద్ర విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకై చేర్చారు. చికిత్స పొందుతున్న సూర్యచంద్ర బుధవారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందాడు. కాగా సూర్యచంద్ర పని చేస్తున్న భవనం పూర్తిగా చట్ట విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారు. విద్యుత్ టవర్ లైన్‌కింద భవనం నిర్మాణం చేయటం నిషేధం. అయితే తాడిగడప మున్సిపాలిటీ అధికారుల అవినీతి కారణంగా చట్ట విరుద్ధంగా బిల్డర్ టవర్ లైన్ కింద భవనం నిర్మిస్తున్నాడు. పైగా ఐదు అంతస్తుల భవనం అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారు. మరి ఈ ఘటనకు మున్సిపాలిటీ అధికారులు, బిల్డర్ బాధ్యులేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధ్యులైన వారి పై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోక పోతే కోర్టును ఆశ్రయిస్తామని స్థానికులు తెలిపారు.